# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 22, జులై 2026






అక్రమంగా తరలిస్తున్న ఏడు

## పశువుల పట్టివేత

**వాహనం స్వాధీనం.. డ్రైవర్ పరారీ, కేసు నమోదు**

చింతలమానేపల్లి, జూలై 21, ప్రభాతవార్త:

మండలంలోని కర్జవెల్లి గ్రామ శివారులో పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకున్నారు. ఎస్సై కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం సిబ్బందితో కలిసి వెహికల్ చెకింగ్ చేస్తుండగా ఆ మార్గంలో వస్తున్న ఒక మహీంద్రా జైలో వాహనం పోలీసులను చూసి కొంత దూరంలో ఆగిపోయింది. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలి పరారయ్యాడు. అనుమానం వచ్చి పోలీసులు వాహనాన్ని పరిశీలించగా, అందులో ఏడు మూగజీవాలను (పశువులను) ఎలాంటి అనుమతులు లేకుండా తాళ్లతో క్రూరంగా కట్టి వధశాలకు తరలిస్తున్నట్లు తేలింది. ఈ మేరకు వాహనాన్ని స్వాధీనం చేసుకుని, పారిపోయిన డ్రైవర్ నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి

## బాధితులకు తక్షణ న్యాయం అందించాలి

★ రౌడీషీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలి: రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

★ భీమారం పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



మంచిర్యాల బ్యూరో, జూలై 21, ప్రభాతవార్త

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి, బాధితులకు తక్షణ సేవలందిస్తూ న్యాయం చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు. భీమారం పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు చేరుకున్న సీపీ ముందుగా పరిసరాలను పరిశీలించి, విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది పనితీరును సమీక్షించారు. అనంతరం స్టేషన్‌కు సంబంధించిన వివిధ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్ఐ, స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ రైటర్లతో మాట్లాడి, ఆన్‌లైన్‌లో వివరాల నమోదు, రికార్డుల అప్‌లోడ్ ప్రక్రియపై ఆరా తీశారు. స్టేషన్ పరిధిలో నమోదవుతున్న నేరాలు, పరిధిలోని గ్రామాల పరిస్థితులు, శాంతిభద్రతలు, నిర్వహణ తదితర అంశాలపై ఎస్ఐని అడిగి తెలుసుకున్నారు. 5ఎస్ విధానంలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సీపీ అంబర్ కిషోర్ ఝా సూచించారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, నేరస్తుల మిగతా 2లో..

## రైతు సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్



- ✦ నాలుగుసార్లు రైతుబంధు ఎగ్గొట్టిన ప్రభుత్వమిది
- ✦ కాళేశ్వరంపై రేవంత్ అబద్దాల ప్రచారం
- ✦ వరంగల్ రైతులు డిక్లరేషన్ ఏమైంది?
- ✦ ఇది కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువే కానీ కాలం తెచ్చిన కరువు కాదు
- ✦ మరణించిన రైతు కుటుంబాలకు చెక్కులు అందజేత
- ✦ బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు

– మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూలై 21, ప్రభాతవార్త



2 లో..

## గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలి

❁ ప్రతి రైతు ఫామ్ పాండ్ నిర్మించాలి: కలెక్టర్

నిర్మల్, జూలై 21, ప్రభాతవార్త:

మారుమూల గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. భూగర్భ జలాల సంరక్షణకు ప్రతి రైతు తన పొలంలో ఫామ్ పాండ్ నిర్మించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మంగళవారం కుంటాల మండలం అంబుగాం గ్రామంలో కలెక్టర్ పర్యటించారు. గ్రామంలో తాగునీరు, విద్యుత్, టెలికాం సేవలు, ఇతర మౌలిక సదుపాయాలపై స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గుర్తించిన కలెక్టర్, గ్రామపంచాయతీ తీర్మానం చేసి ప్రతిపాదనలు పంపితే వెంటనే మిగతా 2లో..



# గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

నూతన బోరుబావిని మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. బోరుబావి ఏర్పాటు చేయనున్న ప్రాంతాన్ని, అక్కడి ట్రాన్స్‌ఫార్మర్‌ను స్వయంగా పరిశీలించి పనులు వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూగర్భ జలాలను కాపాడడంలో ఫామ్ పాండ్‌లు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. గ్రామంలో ఇప్పటికే ఫామ్ పాండ్ ఏర్పాటు చేసిన రైతు క్షేత్రాన్ని సందర్శించి, రైతును అభినందించారు. ఇప్పటికే నిర్మించుకున్న వారితో పాటు కొత్తగా ముందుకు వస్తున్న రైతులను ప్రోత్సహించాలని, గ్రామంలో మరిన్ని ఫామ్ పాండ్‌లు వచ్చేలా అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. గ్రామంలో టెలికాం సేవలను మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. భూగర్భ జలాల పరిరక్షణ బాధ్యత ప్రతి గ్రామస్థరిపై ఉందని, అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ పర్యటనలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీపీఓ శ్రీనివాస్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి ్మ, ఈఈ ఆర్‌డబ్ల్యూఎస్ సందీప్, తహసీల్దార్ కమల్ సింగ్, ఎంపీడీఓ వనజ, సర్పంచ్ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి బాధితులకు తక్షణ న్యాయం అందించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఇళ్లను తరచూ తనిఖీ చేయడంతో పాటు వారి కదలికలు, కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్లను వెంటనే గుర్తించి, ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు, సంస్థలతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని సీపీ స్పష్టం చేశారు. ప్రజా రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో భీమారం ఎస్ఐ, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## అమ్మవార్లకు బోనాలు సమర్పించిన వ్యాపారులు

**- ముగ్గురు అమ్మవార్ల ఆశీస్సులతో వ్యాపారాలు సుభిక్షంగా సాగాలి: వ్యాపారవేత్త ధనుంజయరావు**

**భైంసా, జులై 21, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ పరిధిలో వ్యాపారాలు నిర్వహిస్తున్న యజమానులు అమ్మవార్లకు ఆషాఢ మాస బోనాలను ఘనంగా సమర్పించారు. ఆలయంలో ప్రతి సంవత్సరం భక్తుల సౌకర్యార్థం వివిధ పూజ సామాగ్రితో పాటు 10 రకాల షాపులకు ఆలయ అధికారులు బహిరంగ వేలం, సీల్డ్ టెండర్లు నిర్వహిస్తారు. ఈ వేలంలో దుకాణాలను దక్కించుకున్న వ్యాపారులు ప్రతి ఏటా ఆషాఢ మాసంలో అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఆలయ ఫోటోషాప్ యజమానులు అమ్మవారికి తమ మొక్కులు చెల్లించుకోవడానికి శోభాయాత్రగా తరలివచ్చి బోనాలను సమర్పించారు. అమ్మవారికి బోనం సమర్పిస్తే రానున్న రోజుల్లో అమ్మవారి ఆశీస్సులతో వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుందని, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయనే నమ్మకంతో సిబ్బందితో కలిసి ఈ బోనాల పండుగను నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ వ్యాపారవేత్త ధనుంజయ రావు మాట్లాడుతూ.. జగన్మాత అనుగ్రహం ఉంటే జీవితంలో ఎలాంటి లోటు ఉండదని పేర్కొన్నారు. సృష్టికి మూలమైన ఆ తల్లి దయ, మనల్ని కంటికి రెప్పలా కాపాడే మహాలక్ష్మి, మహాసరస్వతి, మహాకాళి అమ్మవార్ల ఆశీస్సులు మనుషులకు కొండంత బలాన్ని ఇస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాపారులు, ఫోటోషాప్ నిర్వహణ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న ఆలయ వ్యాపార యజమానులు, సిబ్బంది

# రైతు సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూలై 21, ప్రభాతవార్త**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి విస్మరించిందని, కాంగ్రెస్ కు ఓటేసి నపాపానికి ప్రజలు నరకం చూస్తున్నారని బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఆరోపించారు. మంగళవారం మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలంలోని అంకతిపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్లో మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన రైతు సదస్సులో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువే కానీ కాలం తెచ్చిన కరువు కాదన్నారు. రాష్ట్రానికి ఎల్నినో ప్రభావం చేసిన నష్టం కంటే కాంగ్రెస్ చేసిన నష్టమే ఎక్కువన్నారు. కన్నెపల్లి లో ఉన్న వాటర్ ను రోజుకు మూడు టీఎంసీల చొప్పున అన్నారం, సుందిల్ల, ఎల్లంపల్లి బ్యారేజ్ లకు బ్యాక్ వాటర్ ఎందుకు పంపడం లేదని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఒక్క ఎల్ నినో కాదు ఇంకొక ఎల్ నినో వచ్చిన మన రాష్ట్రానికి కరువు రాకుండా బ్యారేజ్ లు కట్టి బాహుబలి మోటార్లు పెట్టించిన ఘనత కేసీఆర్ దేనని అన్నారు. ఎన్నికలకు ముందు రైతుబంధు కేసీఆర్ కంటే ఎక్కువ ఇస్తా అని ప్రజలను మభ్యపెట్టి నాలుగు సార్లు ఎగ్గొట్టిన ఘనుడు రేవంత్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. అంతేకాకుండా నిరుద్యోగ భృతి, రెండు లక్షల ఉద్యోగాలు, రైతులకు రెండు లక్షల రుణమాఫీ ఇలా ఇచ్చిన హామీలన్నిటిని తుంగలో తొక్కాడన్నారు. కాళేశ్వరంపై రేవంత్ రెండు పిల్లర్స్ దెబ్బతిన్నాయని చెప్పి 32 నెలలుగా ఎందుకు మరమ్మతులు చేయించలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ మీద బూటకపు ప్రచారాలు చేస్తూ రైతుల పొలాలకు నీళ్లు ఇవ్వడం లేదని మండిపడ్డారు. అదేవిధంగా రేవంత్ రెడ్డి వరంగల్ సభలో ఏక కాలంలో రైతులకు రూ. 2 లక్షలు రుణమాఫీ చేస్తానని మోసం చేశాడన్నారు. 32 నెలలు గడిచిన ఎందుకు రుణమాఫీ చేయలేదని ప్రశ్నించారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు తన పద్ధతిని మార్చుకోవాలని హెచ్చరించారు. నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలే కానీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడవద్దన్నారు. అదే విధంగా గత మే నెలలో అకాల వర్షానికి గోడలు కూలి ప్రమాదశాత్తు రైతులు మరణిస్తే రెండున్నర నెలలు గడిచినా వారి కుటుంబాలకు ఎలాంటి సహాయం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతు బీమా ద్వారా ఒక్క రైతు కుటుంబానికి మాత్రమే రూ. 5 లక్షలు అందాయన్నారు. మరణించిన నలుగురు రైతు కుటుంబాలకు రూ.5 లక్షల చెక్కులను కేటీఆర్ అందజేశారు. రైతులు చనిపోతున్నా రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేదా అని ప్రశ్నించారు. ఇంకొక 28 నెలల్లో కెసిఆర్ ప్రభుత్వం వస్తుందని, రైతులను పట్టించుకోని ఈ చేతకాని, ప్రభుత్వం పడిపోతుందని ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, జీవన్ రెడ్డి, జోగు రామన్న, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, దాసరి మనోహర్ రెడ్డి, సుంకె రవి, కోనేరు కోనప్ప, దుర్గం చిన్నయ్య, మాజీ ఫిల్మ్ కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మన్ రామ్మోహన్ రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, రాష్ట్ర నాయకులు విజిత్ రావు, మాజీ డీసీఎమ్మెస్ తిప్పని లింగయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ కాంతయ్య, వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ లు ఎల్తాపు సుధాకర్, మాజీ సర్పంచ్ సొల్లు సురేష్, మాజీ యూత్ అధ్యక్షులు మారిశెట్టి సుమన్, స్థానిక నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.







## ప్రతి మొక్క అమ్మ వంటిదే.. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**- ప్రతీ ఏటా పచ్చదనానికి పెద్దపీట వేస్తున్నాం: శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్**

**- శ్రీరాంపూర్ సెంట్రల్ నర్సరీలో ఏక్ పేడ్ మా కే నామ్ మెగా ప్లాంటేషన్**

**నస్పూర్, జూలై 21, ప్రభాతవార్త**

ప్రతి మొక్కా తల్లి లాంటిదే, కేంద్ర ప్రభుత్వం ఏక్ పేడ్ మా కే నామ్ పేరుతో ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని తలపెట్టడం, అందులో భాగంగా శ్రీరాంపూర్ ఏరియాలో మొక్కలు నాటడం ఎంతో సంతోషంగా ఉందని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ (సీసీఓ) ఆదేశాల మేరకు శ్రీరాంపూర్ ఏరియా ఫారెస్ట్ విభాగం ఆధ్వర్యంలో జీఎం కార్యాలయం ఎదుట ఉన్న సెంట్రల్ నర్సరీలో మంగళవారం మెగా ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మునిగంటి శ్రీనివాస్ మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సింగరేణిలో, మరీ ముఖ్యంగా శ్రీరాంపూర్ ఏరియాలో పచ్చదానానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని జీఎం మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. ఏరియా వ్యాప్తంగా మొక్కల పెంపకం ఒక నిరంతర ప్రక్రియలా కొనసాగుతోందని, ప్రతి ఏటా రెండు నుంచి మూడు లక్షల వరకు మొక్కలు నాటుతున్నామని చెప్పారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఐకే ఓసీలో రెండు వేల మొక్కలు నాటామని గుర్తుచేశారు. ఈ ఏడాది కూడా శ్రీరాంపూర్ ఏరియా వ్యాప్తంగా రెండు లక్షలకు పైగా మొక్కలు నాటే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఓపెన్ కాస్ట్ ఓవర్ బర్డెన్ డంప్‌లపై కూడా పెద్ద సంఖ్యలో మొక్కలు పెంచుతూ పర్యావరణ సమతుల్యతకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, ఏరియా ఇంజనీర్ రమణ రావు, ఎస్ఓటూ జీఎం కృష్ణ ప్రసాద్, ఏజీఎం (ఫైనాన్స్) సుమలత మొక్కలు నాటారు. వీరితో పాటు జీఎం కార్యాలయ వివిధ విభాగాల అధిపతులు, అధికారులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (ఫారెస్ట్) హరినారాయణ, డీజీఎం (సేఫ్టీ) విజయ్ కుమార్, డీజీఎం (ఐఈడీ) రాజన్న, డీజీఎం (ఈ అండ్ ఎం) సురేష్, డీజీఎం (వర్క్‌షాప్) కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఏరియా సర్వేయర్ నర్సింగారావు, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ జక్కారెడ్డి, పిట్ సెక్రటరీ సందీప్, యూనియన్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగం చేస్తూనే పీహెచ్‌డీ సాధించిన పంచాయతీ కార్యదర్శి పవార్ విజయ్ కుమార్

**- ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి వృక్ష శాస్త్రంలో డాక్టరేట్ ప్రదానం**

**భైంసా, జులై 21, ప్రభాతవార్త:**

పట్టుదల, కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంటే గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని తానూర్ మండలం జవులా (కే) గ్రామానికి చెందిన పవార్ విజయ్ కుమార్ నిరూపించారు. ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదురైనా చదువును ఆపకుండా శ్రమించి, హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి వృక్ష శాస్త్రం (బోటనీ) విభాగంలో డాక్టరేట్ (పీహెచ్‌డీ) సాధించి గ్రామానికి, మండలానికి గర్వకారణంగా నిలిచారు. పవార్ విజయ్ కుమార్ తన ప్రాథమిక విద్యను జవులా (కే) ప్రభుత్వ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు, పదో తరగతిని ఎల్వి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పూర్తి చేశారు. ఇంటర్మీడియట్ విద్యను ముధోల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్తి చేసి, ఉన్నత విద్య కోసం హైదరాబాద్ వెళ్లారు. అక్కడ డిగ్రీ, ఎంఎస్సీ పూర్తి చేసి, పరిశోధనలపై ఆసక్తితో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వృక్ష శాస్త్ర విభాగంలో పరిశోధనలు చేసి పీహెచ్‌డీ పూర్తి చేశారు. ప్రస్తుతం ఆయన నిర్మల్ జిల్లా భైంసా మండలం దేగాం గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. ఒకవైపు ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూనే, మరోవైపు పరిశోధనలు పూర్తి చేసి పీహెచ్‌డీ సాధించడం పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. ఈ సందర్భంగా పవార్ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. జీవితంలో కష్టాలు ఎదురైనా చదువును వదులుకోలేదని తెలిపారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల ఆశీస్సులు, స్వయం కృషితోనే డాక్టరేట్ సాధించగలిగానని చెప్పారు. గ్రామీణ విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని కోరారు. పవార్ విజయ్ కుమార్ సాధించిన విజయం పట్ల జవులా (కే), దేగాం గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



## సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు రోడ్డు భద్రత చర్యలను

# పకడ్బందీగా అమలు చేయాలి

*** మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, జూలై 21, ప్రభాతవార్త**

సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాల మేరకు జిల్లాలో రోడ్డు భద్రతకు సంబంధించిన అన్ని చర్యలను సమర్థవంతంగా అమలు చేసి రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశానికి డి.సి.పి. ఎ.భాస్కర్, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ప్రతి శాఖ బాధ్యతాయుతంగా పని చేయాలని తెలిపారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై అనుమతించిన లేబైలు, వేసైడ్ సౌకర్య కేంద్రాలు మినహా ఇతర ప్రాంతాలలో భారీ, వాణిజ్య వాహనాల పార్కింగ్‌ను పూర్తిగా నిషేధిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. దాబాలు, హోటళ్లు, వాణిజ్య సంస్థల సమీపంలో అక్రమంగా నిలిపే భారీ వాహనాల వల్ల ప్రమాదాలు పెరుగుతున్నందున ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, రహదారులపై ప్రమాదాలకు గురయ్యే బ్లాక్ స్పాట్లను గుర్తించి అక్కడ వీధి దీపాలు, సి.సి కెమెరాలు, హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, స్పీడ్ కంట్రోల్ చర్యలు, రంబుల్ స్ట్రిప్‌లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. ఇందారం వంతెన నుంచి గోదావరి వంతెన వరకు వీధి దీపాల ఏర్పాటు, ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నిర్వహణ, యూటర్న్‌ల పున: వ్యవస్థీకరణ, రహదారుల షోల్డర్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. రహదారుల పర్యవేక్షణ కోసం అధునాతన ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థ, జి.పి.ఎస్. ఆధారిత నిఘా వ్యవస్థలను వినియోగించి ట్రాఫిక్ ఉల్లంఘనలను గుర్తించి ఈచలాన్ వ్యవస్థతో అనుసంధానం చేయాలని, అత్యవసర పరిస్థితులలో తక్షణ వైద్య సేవలు అందించేందుకు ప్రతి 75 కిలోమీటర్లకు అంబులెన్స్, రికవరీ వాహనం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. రహదారి హక్కు పరిధిలో కొత్త దాబాలు, వాణిజ్య నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదని, ఇప్పటికే ఉన్న అనధికార నిర్మాణాలను తొలగించి రహదారుల భద్రతకు ఆటంకం కలిగించే ఆక్రమణలను నివారించాలని సూచించారు. రహదారుల సమీప భూవినియోగాన్ని నిబంధనల ప్రకారం నియంత్రించి ప్రమాదాలకు దారితీసే పరిస్థితులను అరికట్టాలని అధికారులకు సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థలు, గ్రామాలు, పట్టణాలలో రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ట్రాఫిక్ నిబంధనల పట్ల ప్రజలలో బాధ్యత పెంపొందించాలని తెలిపారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేయాలని తెలిపారు.




డి.సి.పి. మాట్లాడుతూ రహదారి భద్రతను మరింత బలోపేతం చేసేందుకు పోలీసు, రవాణా శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక హైవే సర్వైలెన్స్ బృందాలను ఏర్పాటు చేసి 24 గంటల పర్యవేక్షణ నిర్వహిస్తామని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్, అతివేగం, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, రాంగ్ రూట్ డ్రైవింగ్, ఓవర్‌లోడ్ వాహనాలు, అక్రమ పార్కింగ్ వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై నిరంతర డ్రైవ్‌లు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ రాహ్ వీర్ పథకం గురించి ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలని సూచిస్తూ, రోడ్డు ప్రమాద బాధితులను ప్రమాదం జరిగిన తొలి గంటలో సమీప ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడిన వ్యక్తులకు కేంద్ర ప్రభుత్వం నగదు ప్రోత్సాహకం, ప్రశంసాపత్రం అందజేస్తుందని తెలిపారు. ప్రమాద బాధితులకు సహాయం చేయడానికి ప్రజలు భయపడకుండా ముందుకు రావాలని, సమయానికి అందించే సహాయం అనేక ప్రాణాలను కాపాడగలదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రవాణా, జాతీయ రహదారుల, రోడ్లు భవనాల, పోలీసు శాఖల అధికారులు, మున్సిపల్, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య

## విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య**

**హాజీపూర్, జూలై 21, ప్రభాతవార్త**

మండలంలోని కర్ణమామిడి గ్రామపంచాయతీ పరిధిలోని కేజీబీవీ పాఠశాలను మంగళవారం రోజున జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా కేజీబీవీలో నిర్మాణంలో ఉన్న అదనపు గదుల పనులను పరిశీలించి, వాటిని వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే విద్యార్థినులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కిచెన్ షెడ్‌ను, ప్రాథమిక పాఠశాలను కూడా సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కర్ణమామిడి గ్రామ పంచాయతీని సందర్శించి, గ్రామంలో సైడ్ డ్రైన్ల నిర్వహణ, పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. తాగునీటి పైప్‌లైన్లలో ఎలాంటి లీకేజీలు లేకుండా, క్లోరినేషన్ చేసిన సురక్షిత తాగు నీటిని ప్రజలకు అందించాలన్నారు. అలాగే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, కూలిపోయే ప్రమాదంలో ఉన్న ఇళ్లను గుర్తించి, ఆయా కుటుంబాలను అవసరమైతే వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించేలా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సుమన్, ఎం.ఈ.ఓ. తిరుపతి రెడ్డి, సర్పంచ్ బొడ్డు భూమయ్యా, పంచాయతీ కార్యదర్శి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో విద్యార్థులపై లాఠీ-చార్జ్‌ను తీవ్రంగా ఖండించిన ఎంసీపీఐయు

**బెల్లంపల్లి, జూలై 21, ప్రభాతవార్త**

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు, యువకులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని ఎంసిపిఐయు పార్టీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు బెల్లంపల్లి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎంసిపిఐయు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీ జంతర్ మంతర్ నుంచి నిర్వహించిన చలో పార్లమెంట్ కార్యక్రమంలో పాల్గొన్న వేలాది మంది విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం, బాష్పవాయు గోళాలు ప్రయోగించడం, విచక్షణారహితంగా దాడులు జరపడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ఈ ఘటనను ఎంసిపిఐయు పార్టీ మంచిర్యాల జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రశ్నించడం నేరమా - జవాబు కోరడం పాపమా? అంటూ ఆయన ప్రశ్నించారు. దేశ విద్యా వ్యవస్థలో పారదర్శకత, పరీక్షల నిర్వహణలో న్యాయం, జవాబుదారీతనం కోరుతూ విద్యార్థులు గత 20 రోజులుగా శాంతియుతంగా ఆందోళన కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతినిధులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం, ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం వల్లే పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయని విమర్శించారు. సమస్యను సంభాషణ ద్వారా పరిష్కరించాల్సిన చోట బలప్రయోగం చేయడం ప్రభుత్వ వైఫల్యాన్ని సూచిస్తుందని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధ హక్కు అని, ఆ హక్కును లాఠీలు, బాష్పవాయు గోళాలతో అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని మండిపడ్డారు. ఈ ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని పార్టీ డిమాండ్ చేసింది. అలాగే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరెపల్లి రమేష్, ఆరెపల్లి సతీష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.




## ఆకస్మిక తనిఖీతో పోలీస్‌స్టేషన్ పనితీరుపై సమగ్ర సమీక్ష

**- ప్రతి కేసుపై ఆరా.. రికార్డుల పరిశీలన.. శాంతిభద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సూచన : డీసీపీ ఎ,భాస్కర్**

**మంచిర్యాల, జూలై 21, ప్రభాతవార్త**



మంచిర్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌ను జిల్లా పోలీస్ డిప్యూటీ కమిషనర్ ఎ, భాస్కర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రిసెప్షన్ పనితీరు, ప్రజల నుంచి అందిన దరఖాస్తుల స్వీకరణ, వాటి పరిష్కార విధానంపై ఆరా తీశారు. అలాగే స్టేషన్‌లో నమోదైన ప్రతి కేసుకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, పెండింగ్ వ్యవహారాలను సత్వరమే పరిష్కరించేలా అధికారులకు తగిన సూచనలు, మార్గనిర్దేశం చేశారు. అనంతరం స్టేషన్‌కు సంబంధించిన వివిధ రికార్డులు, నేరాల నమోదు, ఆన్‌లైన్‌లో కేసుల నమోదు, రికార్డుల నమోదు, నవీకరణ ప్రక్రియలను పరిశీలించి సిబ్బంది పనితీరును సమీక్షించారు. పోలీస్ అధికారులు, సిబ్బందితో సమావేశమై ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా డీసీపీ భాస్కర్ మాట్లాడుతూ, మంచిర్యాల జిల్లా కేంద్రానికి ఉమ్మడి జిల్లా పరిధితో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా ప్రజల రాకపోకలు అధికంగా ఉంటాయని, దీంతో పట్టణంలో రద్దీ ఎక్కువగా ఉంటుందని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ అప్రమత్తంగా పనిచేస్తున్నారని చెప్పారు. పట్టణంలోని వ్యాపార సంస్థలు, దుకాణదారులు, ప్రజలు తమ నివాసాలు, వ్యాపార సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల ద్వారా నేరాలను నివారించడంతో పాటు నేరస్థులను త్వరగా గుర్తించి పట్టుకోవడం సులభతరం అవుతుందని తెలిపారు. ఈ తనిఖీలో మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ రావు, పలువురు ఎస్సైలు, ఏఎస్సైలు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

**హాజీపూర్, జూలై 21,ప్రభాతవార్త**

గుడిపేట శివారులోని జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మిట్టపల్లి మల్లేష్ అనే వ్యక్తి మృతి చెందాడు. హాజీపూర్ ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం మంచిర్యాలకు చెందిన మిట్టపల్లి మల్లేష్ (57) తన ఏపీ 28 బీఏఫ్ 9285 నెంబర్ గల మోటార్ సైకిల్ వేసుకొని మంచిర్యాల నుండి గుల్లకోటలోని ధనలక్ష్మి సిరామిక్స్ పైపుల కంపనీకి వెల్డింగ్ పని గురించి వెళ్ళి పని అనంతరం తిరిగి అదే మోటార్ సైకిల్ నడుపుకుంటూ మంచిర్యాలకు వస్తుండగా మార్గ మధ్యలో గుడిపేట గ్రామ శివారులో జాతీయ రహదారి పై అతని వెనకాలే లక్సెట్టిపేట వైపు నుండి మంచిర్యాల వైపు వెళ్తున్న సీజీ 07 సీఎస్ 8415 నెంబర్ గల లారీ డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నడుపుకుంటూ వచ్చి మల్లేష్ మోటార్ సైకిల్ కి వెనకాల టక్కరు ఇవ్వగా మోటార్ సైకిల్, మల్లేష్ లారీ ముందు బంపర్ లో ఇరుక్కొని కొద్ది దూరం ఈడ్చుకొని వెళ్ళగా మల్లేష్ కి తీవ్ర రక్త గాయాలు అయి అక్కడికక్కడే చనిపోయాడు. మృతుని భార్య మిట్టపల్లి రాజేశ్వరి దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.




## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

### - రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

**నస్పూర్, జూలై 21, ప్రభాతవార్త**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ.లు, ఎ.ఈ.ఆర్.ఓ.లతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను అన్ని జిల్లాలలో వేగవంతంగా పూర్తి చేసి, భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన కాలపట్టికను ఖచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, అనర్హుల పేర్ల తొలగింపు, ఓటరు వివరాల సవరణ వంటి ప్రక్రియలను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి సమగ్ర సమాచారాన్ని సేకరించాలని, ప్రజలకు అవసరమైన అవగాహన కల్పిస్తూ దరఖాస్తులను స్వీకరించి త్వరితగతిన పరిశీలించాలని తెలిపారు. అందిన ఫారాలు, దరఖాస్తులను ఎలాంటి జాప్యం లేకుండా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని తెలిపారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి దరఖాస్తును నిష్పక్షపాతంగా పరిశీలించి, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాల వారీగా పురోగతిని ప్రతిరోజూ సమీక్షిస్తూ, పెండింగ్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను అధికారుల సమన్వయంతో వేగవంతం చేస్తున్నామని, నిర్ణీత గడువులోగా ప్రక్రియ పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లు, వాలంటీర్లు, యువత సమన్వయంతో ప్రక్రియ వేగవంతానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, ప్రత్యేక ఉపపాలన అధికారి చంద్రకళ, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో వేగం పెంచిన కాంగ్రెస్.. కౌటాలలో ఇంటింటా ప్రచారం

### - డిసిసి ఉపాధ్యక్షుడు దుర్గం జానకిరామ్

**కౌటాల, జులై 21, ప్రభాతవార్త:**

కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, ఎమ్మెల్సీ దండే విఠల్ ఆదేశాల మేరకు డీసీసీ ఉపాధ్యక్షుడు దుర్గం జానకిరామ్ ఆధ్వర్యంలో మంగళవారం కౌటాల గ్రామపంచాయతీ లోని 8వ వార్డులో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించారు. గతంలో ఓటరు జాబితాలో పేరు ఉండి ప్రస్తుతం ఎస్ఐఆర్ ఫారం అందని ఇద్దరు ఓటర్లను గుర్తించి, వారి వివరాలను ఫారం-6 లో నమోదు చేయాలని బీఎల్ఓ సూపర్వైజర్‌కు సూచించారు. ఇప్పటివరకు ఎస్ఐఆర్ ఫారాలు సమర్పించని ఓటర్లను గుర్తించి, వారికి ఫారాలు నింపి సంబంధిత బీఎల్ఓకు అందజేశారు. ఈ సందర్భంగా డీసీసీ ఉపాధ్యక్షుడు దుర్గం జానకిరామ్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ఎవరూ తమ ఓటు హక్కును కోల్పోకుండా ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ సూపర్వైజర్ బట్టమేకల గట్టయ్య, బీఎల్ఏలు బట్టమేకల నానయ్య, లింగడే శ్రీనివాస్, వార్డు సభ్యుడు జాడి రాంకుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కిషోర్, సుధాకర్, రవి, గౌస్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.







# రహదారులపై ప్రమాదాల నివారణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలి

### - రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్

**నస్పూర్, జూలై 21, ప్రభాతవార్త**

జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయం నుండి అదనపు కార్యదర్శి ఇలంబర్తి, శాంతి భద్రతల అధికారులు, రవాణా, రహదారి భవనాలు, జాతీయ రహదారుల శాఖల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, రవాణా, రహదారులు భవనాల శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలోని జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం జాతీయ రహదారులపై ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని, జిల్లాస్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశాలు ప్రతినెల నిర్వహించాలని తెలిపారు. టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలు, బ్లాక్ స్పాట్ లను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రమాదాలు జరిగిన వెంటనే క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. వాహనదారులు తప్పకుండా సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలోని జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రహదారి భద్రత కమిటీ సమావేశాలు నిర్వహించి భద్రతాపరమైన చర్యలు తీసుకుంటున్నామని, రహదారిపై ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్ ప్రాంతాలను గుర్తించి రక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిపి ఎ.భాస్కర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రైతులు ఆరుతడి పంటలను మాత్రమే సాగు చేయాలి: డిఏఓ

**బెజ్జూర్, జూలై 21, ప్రభాతవార్త:**

బెజ్జూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ అధికారులు విత్తనాలు, ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని రైతులు ఆరుతడి పంటలను మాత్రమే సాగు చేయాలని డిఏఓ వెంకట్ సూచించారు. ఈ సీజన్లో ఎల్నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా ఉన్నందున రైతులు ఇట్టి విషయాన్ని గమనించి కంది, పెసర, జొన్న తదితర ఆరుతడి పంటలను సాగు చేయాలని అన్నారు. వరి నాట్లు వేసి నష్టపోకూడదని తెలిపారు. మండలంలోని డీలర్లు రైతులకు ఇట్టి విషయంపై అవగాహన కల్పించాలని ఎంఏఓ నాగరాజు సూచించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల డీలర్లు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీమద్ భాగవత సప్తాహ ప్రవచన వేడుకలు

**తాండూర్, జూలై 21, ప్రభాతవార్త :**



మండలంలోని అచలాపూర్ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ భారతి తీర్థ కళ్యాణ మండపంలో బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీమద్ భాగవత సప్తాహ ప్రవచన వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం నిర్వహించిన భాగవత సప్తాహ వేడుకల్లో భాగంగా చెరసాలలో దేవకీ వసుదేవులకు శ్రీకృష్ణ పరమాత్ముడి జన్మలీలను ఆదిలాబాద్ కు చెందిన ఫణతుల మేఘరాజ్ శర్మ భక్తులకు వివరించారు. గోకులంలో నంద యశోదల ఆనందాన్ని కీర్తిస్తూ భక్తులు నృత్యాలు, భజనలు అందరిని ఆకట్టుకున్నాయి. శ్రీమద్ భాగవత సప్తాహ ప్రవచన కార్యక్రమం ఈనెల 24 వరకు కొనసాగుతుందని బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు.

## ఈ నెల 30వ తేదీన వాహనాల వేలం

### - జిల్లా అటవీ అధికారి బాలమణి

**ఆసిఫాబాద్, జూలై 21, ప్రభాతవార్త :**

ప్రభుత్వ అక్రమ కలప రవాణా చేస్తూ పట్టుబడి ప్రభుత్వ పరం చేయబడిన వాహనాలను ఈ నెల 30వ తేదీన యథాస్థితిలో వేలం వేయడం జరుగుతుందని జిల్లా అటవీ అధికారి బాలమణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తిగా జప్తు చేయబడిన, ఖండించబడిన వాహనాలలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, టాటా ఏస్, మ్యాజిక్ ఇతర వాహనాలు ఉన్నాయని తెలిపారు. జిల్లా అటవీ అధికారి, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ పేరిట డిమాండ్ డ్రాఫ్ట్ చెల్లించి జిల్లా అటవీ అధికారి కార్యాలయంలో పని వేళలలో దరఖాస్తు ఫారం పొందాలని తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఈ నెల 30వ తేదీ మధ్యాహ్నం 2 గంటలలోపు కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

## ఉచిత కంటి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 21, ప్రభాతవార్త :**

శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి - చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ వ్యవస్థాపకులు డా. కొత్తపల్లి శ్రీనివాస్, డా. కొత్తపల్లి అనిత కోరారు. మంగళవారం నిర్వహించిన శిబిరానికి 24 మంది హాజరుకాగా, పరీక్షలు నిర్వహించిన వైద్యులు తొమ్మిది మందికి కేటరాక్ట్ శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. ఎంపికైన వారికి సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా రవాణా, భోజన సదుపాయాలు కల్పించి బెల్లంపల్లి లయన్స్ క్లబ్ కంటి ఆస్పత్రికి తరలించి శస్త్రచికిత్సలు చేయించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే శస్త్రచికిత్సలు చేయించుకుని లబ్ధి పొందిన వారు ఈ ఉచిత వైద్య సేవలపై ఇతరులకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో ఆప్తమాలజిస్ట్ శ్రీనాథ్, ఐ క్యాంప్ ఇన్‌చార్జి గోపి, కిమ్స్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



# ఫుట్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టే వరకు పోరాటం

**ఆసిఫాబాద్ టౌన్, జూలై 21, ప్రభాతవార్త :**

వాంకిడి మండలం బంబారా గ్రామపంచాయతీ పరిధిలోని జాతీయ రహదారిపై ప్రజల రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించేందుకు ఫుట్ బ్రిడ్జి, బస్ షెల్టర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఐ నాయకులు మంగళవారం ఎస్పీ నితికా పంత్, ఆర్డీవో కార్యాలయ ఏవో దుర్గం శ్రావణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి మాట్లాడుతూ ఫుట్ బ్రిడ్జి నిర్మాణం జరిగే వరకు దశలవారీగా నిరంతర ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు నివారించేందుకు అండర్‌పాస్, బస్ షెల్టర్, సెంట్రల్ లైటింగ్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బోయిరె ప్రకాష్, మండల కార్యదర్శి కొదురుపాక మహేష్, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు పిప్పిరి వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు వర్కులు రాకేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జ్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ నితికా పంత్ కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఐ నాయకులు



మాట్లాడుతున్న బిజెపి జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం

## వర్షాభావంతో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేల పరిహారం ఇవ్వాలి


**ఆసిఫాబాద్, జూలై 21, ప్రభాతవార్త :**

కొమరం భీమ్ జిల్లాలో వర్షాభావం కారణంగా పత్తి పంటలు దెబ్బతిన్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే పంట నష్టం సర్వే నిర్వహించి రైతులకు ఎకరానికి రూ.50 వేల పరిహారం అందించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజనను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని, రైతుల సమస్యలను నిరక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మన్ కీ బాత్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఎలగతి సుచిత్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చెర్ల మురళీధర్, బీజేవైఎం వాంకిడి మండల అధ్యక్షుడు మండోకర్ వికాస్ పాల్గొన్నారు.

## రైల్వే అండర్ బ్రిడ్జిల కింద చేరిన వరద నీరు

**తాండూర్, జూలై 21, ప్రభాతవార్త :**

మండలంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. మండలంలోని రైల్వే అండర్ బ్రిడ్జిల కిందకు భారీగా వరద నీరు చేరుకుంది. రైల్వే అండర్ బ్రిడ్జి కింద గల రహదారులు జలమయంగా మారడంతో నిత్యం రాకపోకలు సాగించే, ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయిస్తున్నారు. వర్షం కురిస్తే రైల్వే అండర్ బ్రిడ్జిల రహదారులు చెరువులను తలపిస్తున్నాయని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే మోటార్లతో నీటిని తొలగించి రాకపోకలు పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.



రైల్వే అండర్ బ్రిడ్జి కింద చేరిన వరదనీరు

## విద్యుత్ ట్రాన్స్ ఫారంను ధ్వంసం చేసిన గుర్తు తెలియని దుండగులు

**తాండూర్, జూలై 21, ప్రభాతవార్త:**



మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారులో వ్యవసాయ బోరుకు సంబంధించిన విద్యుత్ ట్రాన్స్ ఫారంను సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. రైతులు తెలిపిన వివరాల ప్రకారం... కొత్తకొండ ఆశమ్మ పొలంలోని విద్యుత్ వ్యవసాయ ట్రాన్స్ ఫారంనుగుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసి కాపర్ వైర్, కాయిల్, ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. దీంతో కొందరు రైతుల పొలాలకు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి నూతన ట్రాన్స్ఫార్మర్ను ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. విద్యుత్ ట్రాన్స్ఫారం ధ్వంసం పై తాండూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు.



గోలేటి సిహెచ్పి వద్ద మొక్క నాటిన జిఎం శ్రీ రమేష్

## మొక్కల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

### - బెల్లంపల్లి ఏరియా జిఎం శ్రీరమేష్

**తాండూర్, జూలై 21, ప్రభాతవార్త :**

మొక్కలు నాటి వాటి సంరక్షణకు అందరూ ప్రాధాన్యత ఇవ్వాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీరమేష్ అన్నారు. గోలేటి సిహెచ్పి వద్ద మంగళవారం ఏరియా అధికారులతో కలిసి జిఎం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ ఒక ఉద్యమంలా మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గనుల డంపులపై మొక్కలు నాటి వాటిని పరిరక్షించి సిఎ ల్యాండ్ కింద అటవీ శాఖకు అందించడం మూలంగా కొత్త గనులకు అనుమతులు వస్తున్నాయని తెలిపారు. మొక్కలు నాటడంతో సరిపెట్టకుండా వాటిని భావితరాలకు ఫలాలను, స్వచమైన ప్రకృతి ని అందించేలా సంరక్షించాలని కోరారు. గతంలో సిహెచ్పి పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని వృక్షాలుగా ఎదిగేల పరిరక్షించిన సిబ్బందిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి తిరుపతి, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు మచ్చగిరి నరేందర్ , ఏరియా ఇంజినీర్ కృష్ణ మూర్తి, ఎస్ఓ టు జి ఎం రాజమల్లు ,గోలేటి ఓసి పిఓ ఉమాకాంత్, ఏరియా సేఫ్టీ అధికారి స్వామి రాజు, సిహెచ్ పి హెచ్ఒడి కోటయ్య, డీజీఎం (పర్సనల్) దేవరకొండ కిరణ్ బాబు, ఎన్విరాన్మెంట్ అధికారి జైపాల్ జాదవ్ , ఫారెస్ట్ అధికారిణి సుష్మ లక్ష్మి , పిట్ కార్యదర్శి రామయ్య అన్ని విభాగాల అధిపతులు , ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసిల్దార్

## రేషన్ కార్డుల ఈ కేవైసీ 31 లోపు పూర్తి చేయాలి

**బెజ్జూర్, జూలై 21, ప్రభాతవార్త:**

బెజ్జూర్ మండలంలోని రేషన్ కార్డు లబ్ధిదారులు తప్పనిసరిగా ఈనెల 31వ తేదీ లోగా ఈ కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలని తహసిల్దార్ రామ్మోహన్ రావు సూచించారు. మండలంలోని రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించి ఇట్టి విషయాన్ని తెలియజేశారు. అనర్హులను గుర్తించి, అర్హులకు ప్రభుత్వ ప్రయోజనాలు అందించడం కొరకు ఈకేవైసీ తప్పనిసరి అని తెలియజేశారు. గడుపులోగా ఈ కేవైసీ పూర్తి చేయని వారికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అన్నారు.



## విద్యార్థులకు బేస్‌లైన్ పరీక్షలు

### - మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 21, ప్రభాతవార్త :**

జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 2వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రెండు రోజుల పాటు బేస్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల బ్రాంచ్ సిర్పిల్క్ పాఠశాలను సందర్శించి, బేస్‌లైన్ పరీక్షల నిర్వహణపై ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈసారి తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించాలని, విద్యార్థులు పరీక్షలు రాసిన వెంటనే వారి సమాధానాలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి పరీక్షకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, 100 శాతం హాజరు ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. బేస్‌లైన్ పరీక్షల ద్వారా విద్యార్థుల ప్రస్తుత విద్యా ప్రమాణాలు, అభ్యసనా సామర్థ్యాలను అంచనా వేసి, తదనుగుణంగా బోధనలో అవసరమైన మార్పులు చేసేందుకు అవకాశం ఉంటుందని ఎంఈఓ పేర్కొన్నారు. విద్యార్థుల అభ్యసనా స్థాయిని మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, సీఆర్‌పీ మధుకర్ పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 21, ప్రభాతవార్త :**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల కాగజ్‌నగర్‌లో 2026-27 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకుల నియామకం కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో తెలుగు-1, ఇంగ్లిష్-2, కామర్స్-2, బోటనీ-1, జువాలజీ-1, పొలిటికల్ సైన్స్-2, హిస్టరీ-2, ఎకనామిక్స్-1, కంప్యూటర్ సైన్స్-2 చొప్పున మొత్తం 14 అతిథి అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పీజీలో కనీసం 55 శాతం మార్కులు సాధించి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హతలు ఉన్న అభ్యర్థులకు నియామకంలో ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఈ నెల 23వ తేదీలోగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కాగజ్‌నగర్‌లో దరఖాస్తులు సమర్పించాలని ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి సూచించారు.

# మున్సిపాలిటీల్లో పారిశుధ్యానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలి

## వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలి - కలెక్టర్ భవేశ్ మిశ్రాపట్టణాల్లో మౌలిక వసతులపై కలెక్టరేట్‌లో ఉన్నత స్థాయి సమీక్ష

నిర్మల్, జులై 21, ప్రభాతవార్త:



జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో పారిశుధ్య పనులకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపాలిటీల పనితీరుపై ఆయన అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాకాలం దృష్ట్యా పట్టణాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. నిరంతరం పారిశుధ్య పనులు కొనసాగించాలని, వీధులు, డ్రైన్లు, చెత్త సేకరణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ఘన వ్యర్థాల నిర్వహణను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేరుగా సేకరించి, శాస్త్రీయ పద్ధతిలో డంపింగ్ యార్డులకు తరలించాలని ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని, దుకాణాలు, వ్యాపార సముదాయాల్లో తనిఖీలను ఉధృతం చేయాలన్నారు. పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, రోడ్లు, వీధి దీపాలు, తాగునీటి సరఫరాలో లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని కలెక్టర్ సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్లు రవి బాబు, సుందర్ సింగ్, యాదయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## రైతు సదస్సుకు తరలి వెళ్లిన బిఆర్ఎస్ శ్రేణులు

తాండూర్, జులై 21, ప్రభాతవార్త :

తాండూర్ మండలానికి చెందిన భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) నాయకులు కార్యకర్తలు మంగళవారం లక్షెట్టిపేట లో నిర్వహించిన రైతు సదస్సు కు తరలి వెళ్లారు. ఈ రైతు సదస్సుకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ముఖ్యఅతిథిగా హాజరైనారు. బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సుబ్బా దత్తుమూర్తి, నాయకులు ఎల్మ రామచందర్, గట్టు సంతోష్, మాసాడి శ్రీరాములు, బోడ సతీష్, క్రాంతికుమార్, రాజేందర్, తదితరులు తరలివెళ్లారు.



## సరస్వతీ శిశు మందిరానికి పూర్వ విద్యార్థుల విరాళం

### - పాఠశాల అభివృద్ధి కోసం ..76,450 విరాళంగా అందజేత

భైంసా, జులై 21, ప్రభాతవార్త:

భైంసా పట్టణంలోని కిసాన్ గల్లి శ్రీ సరస్వతీ శిశు మందిరం పాఠశాలలో మంగళవారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. పాఠశాలలో 2003 04 విద్యాసంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆధునీకరణలో భాగంగా స్థల రిజిస్ట్రేషన్ ఖర్చుల కోసం పూర్వ విద్యార్థులు ..76,450 విరాళంగా సేకరించి పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. చదువు చెప్పిన బడికి పూర్వ విద్యార్థులు అందించిన సహకారం అభినందనీయమని పాఠశాల ప్రబంధ సమితి సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. వారికి పాఠశాల కమిటీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా పాఠశాల అభివృద్ధికి ఇలాగే సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పురస్తు గోపాల్ కిషన్, పాఠశాల ప్రబరి రమేష్ మాశెట్టి, జిల్లా సభ్యులు డాక్టర్ నగేష్, పాఠశాల అధ్యక్షుడు కుంట కాశీనాథ్, కార్యదర్శి భజనోళ్ల రవి, ప్రబంధకారిణి, సలహా సమితి సభ్యులు, ఆచార్యులు పాల్గొన్నారు.

## ఉప్పు రవీందర్‌కు నేషనల్ ఎడ్యుకేటర్ ఐకాన్ అవార్డు ప్రదానం

### - యోగా రంగంలో విశిష్ట సేవలకు గుర్తింపు

భైంసా, జులై 21, ప్రభాతవార్త:

భైంసా మండలంలోని ఈలేగాం గ్రామానికి చెందిన ఉప్పు రవీందర్ నేషనల్ ఎడ్యుకేటర్ ఐకాన్ అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో శారదా ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేశారు. యోగా రంగంలో రవీందర్ కనబరిచిన ప్రతిభ, విశిష్ట నైపుణ్యాలను గుర్తించి సొసైటీ నిర్వాహకులు ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు డాక్టర్ పృథ్వీరాజ్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా ఉప్పు రవీందర్ మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో నేషనల్ ఎడ్యుకేటర్ ఐకాన్ అవార్డు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తన సేవలకు తగిన గుర్తింపు లభించడంపై గ్రామస్తులు, పలువురు ప్రముఖులు ఆయనకు అభినందనలు తెలిపారు.




## తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమీక్ష సమావేశం

### - ఈ నెలాఖరులోగా 100 ఈకేవైసీ పూర్తి చేయాలి

### - తహసీల్దార్ బి. విజయ్‌కాంత్‌రావు





సారంగాపూర్, జులై 21, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యా లయంలో చౌక ధరల దుకాణాల (రేషన్ షాపుల) డీలర్లతో తహసీల్దార్ బి. విజయ్‌కాంత్ రావు మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన డీలర్లకు పలు కీలక సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయ్‌కాంత్ రావు మాట్లాడుతూ.. చౌక ధరల దుకాణాల డీలర్లు విధుల నిర్వహణలో తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఈ నెలాఖరులోగా రేషన్ కార్డుదారులందరికీ 100 శాతం ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. లైసెన్స్ రెన్యూవల్ పెండింగ్‌లో ఉన్న డీలర్లు వెంటనే ఆ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా బియ్యం పంపిణీ చేయాలని డీలర్లకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) వెంకట నర్సయ్య, చౌక ధరల దుకాణాల డీలర్ల సంఘం అధ్యక్షుడు నారాయణ రెడ్డి, మండలంలోని వివిధ గ్రామాల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## అధ్యాపకుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

చెన్నూరు, జులై 21, ప్రభాతవార్త



చెన్నూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. పట్వర్ధన్ తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్ లో రెండు, తెలుగులో ఒకటి, ఇంగ్లీష్ లో ఒకటి, కామర్స్‌లో మూడు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 22 బుధవారం సాయంత్రం 4 గంటల లోపు చెన్నూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

## కామన్ కమ్యూనిటీ షెడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

### - దివ్యనగర్‌లో రూ.5 లక్షలతో నిర్మాణం

నిర్మల్, జులై 21, ప్రభాతవార్త:



పట్టణంలోని ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని బీజేపీ శాసనసభాపక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని దివ్యనగర్ కాలనీలో కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన కామన్ కమ్యూనిటీ షెడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దివ్యనగర్ కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. కాలనీ ప్రజలు ఈ షెడ్డును సమావేశాలు, ఇతర సామాజిక కార్యక్రమాలకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ వినీశ లక్ష్మి, బీజేపీ సీనియర్ నాయకుడు రావుల రాంనాథ్, కౌన్సిలర్లు గంజి రాజు, రావులవార్ విఠల్, కూన శశాంక్, శ్రీరామోజీ నరేష్, పార్టీ నాయకులు జుట్టు దినేష్, సాదం అరవింద్, చందు, ఈశ్వర్, ఆనంద్, ప్రజోత్, జమాల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు సవరణ ప్రక్రియను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు

### - ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు పరిశీలించుకోవాలి

### - బీఆర్ఎస్ మండల కన్వీనర్ దేవి శంకర్

సారంగాపూర్, జులై 21, ప్రభాతవార్త:



సారంగాపూర్ మండలంలోని అడెల్లి గ్రామంలో కొన సాగుతున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియను బీఆర్ఎస్ మండల కన్వీనర్ దేవి శంకర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు లభించేలా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ బిఎల్ఓను సంప్రదించి, ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో సరిచూసుకోవాలని సూచించారు. గ్రామంలో ప్రజలు అందించిన దరఖాస్తులన్నింటినీ సకాలంలో ఆన్‌లైన్ చేశారో లేదో సిబ్బంది నిశితంగా సరిచూసుకోవాలని కోరారు. అర్హులైన యువత కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని, వివరాల్లో తప్పులు ఉంటే సవరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మోతే వార్ లక్ష్మణ్, గణేష్, సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.